


(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

# -138-

(15 ‘ మార్చ్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**మా బంధువుల్లో ఒకాయన వున్నాడు.** ఆయనగారికి ప్రొద్దెక్కేదాకా నిద్రపోవడం అలవాటు. రాత్రిపూట ఎంతసేపైనా మేల్కొంటాడు గాని ఉదయం తొమ్మిది లోపల లేవడమంటే మాత్రం అసాధ్యమైన పనిగా వుంటుంది.

తొమ్మిదింటికి లేచి ఒక గంట ఉదయపు పనులు చేసుకుని, భోజనాదులు ముగించుకుని ఆఫీసుకి చేరతాడు. ఆ గంటా ఆయన కార్యక్రమం చూస్తుంటే మిక్కీమౌస్ చిత్రం జ్ఞాపకం వస్తుంది. గడ్డం చేసుకోవడం అయిదు నిముషాలు, స్నానం పదినిమిషాలు. డ్రస్సు వేసుకోవడం పదినిముషాలు. అన్నం కోసం పీట మీద కూర్చుని నెక్ టై బిగించుకుంటూ వుంటాడు.

ఒక్కొక్కప్పుడు భార్యనే సైకిల్ బయట పెట్టమంటూ వుంటాడు ఆ గంటలో ఆయనగారిని ఎవరూ పలకరించకూడదు. ఏదైనా మాట్లాడించినా "సాయంత్రం" అనే జవాబే వస్తుంది. ఒకప్పుడు తొందరలో చొక్కా తిరగవేసి తొడుక్కోవడం సంభవిస్తూ వుంటుంది. భార్య "చొక్కా సరిగ్గా తొడుక్కోండి. తిరగవేసుకున్నారు" అంటే "ఇప్పుడు కాదు సాయంత్రం" అంటాడాయన.

ఒకసారి ఆవిడ అన్నం వడ్డిస్తూ "కూర ఎలా వుంది? దొడ్లో ఆనపకాయ కోసివండా" అంది. దానికి ఆయన "ఆనపకాయ మాట సాయంత్రం. పులుసు పొయ్యి" అన్నాడు. ఆయనగారు వెళ్ళిన తర్వాత "ఇహ ఈ జీవితం ఇంతే ఆనపకాయ లేదూ, అర్ధాంగీ లేదు నిద్రాదేవతకు దాసులైపోయారు. సర్వం సాయంత్రంలో పడ్డాయి" అని నీళ్ళు కారడం మామూలైంది.

ఆవిడ చెపుతూ వుంటుందిలా "నేను కాపరానికి వచ్చిన తర్వాత ఆయనగారు ఏ రెండు మూడుసార్లో సూర్యోదయం చూచి వుంటారు. అస్తమయాలు తప్ప మరొకటి తెలియదాయనకు. ఒకసారి సముద్ర స్నానానికి వెడదామని బుద్ధిపుట్టి పడుకుంటే మెలుకువరాదని, తెల్లవారుఝాముదాకా మేల్కొని అప్పుడు బయలుదేరారు సముద్రానికి.

అవ్వాళ చూశారు సూర్యోదయం. ఆ ఎర్రటి, చల్లటి ఉదయభానుణ్ణి చూచి ఎంతోసేపు ఉప్పొంగిపోయారు. నన్ను పిలిచి "మల్లికా! ఎల్లప్పుడు ఇలాగేవుంటుంది కదూ సూర్యోదయం. రోజూ చూస్తే బాగుండును" అన్నారు పాపం.

మరోసారి రైల్లో ఫస్టుక్లాసు బుక్కింగ్ దొరక్క మూడో తరగతిలో ప్రయాణం చెయ్యాల్సివచ్చింది. అప్పుడు నిద్రపట్టక అలా కూర్చోవడంవల్ల సూర్యోదయం చూచే అదృష్టం కలిగిందాయనగారికి. ఇంకోమాటు ఎప్పుడన్నా చూశారేమో జ్ఞాపకం లేదు" అన్నదామె.

కొందరిళ్ళలో పురుష పుంగవులు ఎంత అవసరమైన పని వున్నా వారి నిర్ణీత సమయానికిగాని కళ్ళు తెరవరు. మామూలు సమయాలలో అలా వారిని వదిలి వేసినా అవసరం వచ్చినప్పుడు నిద్ర లేపవలసి వస్తూ వుంటుంది అర్ధాంగులకు.

"ఏమండీ మిమ్మల్నే దయవుంచి ఒకసారి కళ్ళు తెరవండి. సౌందర్య పూరితమైన ప్రకృతి మీద ఒకసారి మీ దివ్య దృక్కులు ప్రసరింపచెయ్యండి. మీకోసం అటమటించే ఈ ప్రాణుల్ని ఒకసారి అలవోకగా చూసి ధన్యుల్ని చెయ్యండి. పది గంటల గూడ్సు బండి సిగ్నల్ కోసం దూరంగా నిలిచి కూస్తోంది. కొంచెం ఆలకించండి. పాలునురుగులు వచ్చి వచ్చి మరగ కాగిపోయినాయి. లేచి కొంచెం కాఫీ నోట్లో పోసుకుని మేము ముందు త్రాగినందుకు అందించే క్షమాపణలందుకోండి. కిటికీ ప్రక్క నిండుగా పూసిన నందివర్ధనం మీకు నీరాజనాలందివ్వాలని చూస్తోంది. కొంచెం అందుకోండి" అని ప్రార్థించడం కద్దు.

ఆయనగారు "ఎందుకు లేవడం (ఏమిటి విశేషం) ఒక్క అరగంట ఆగి చెపుదువుగాని. ఒక్క అరగంటయినా ఇప్పుడేం తొందర" అని దొర్లిపడుకోవడం జరుగుతూ వుంటుంది.

ఇలాటి సమయాలలో కుంభకర్ణుడి వృత్తాంతం జ్ఞాపకం వస్తుంది. రామరావణాసుర యుద్ధ సమయంలో ఎందుకైన మంచిదని రావణాసురుడు వెళ్ళి తమ్ముణ్ణి నిద్రలేపడానికి ప్రయత్నించాడుట. కొంతసేపటికి కుంభకర్ణుడికి నిద్రలేపుతున్నారన్న విషయం కొంతవరకు బోధపడిందిట. కానీ లేవాలనిపించలేదు. పైగా..

"ఇంద్రాది సురులలో  
ఎవరు మేల్కొన్నారిపుడు?  
నన్ను మేల్కొల్పుటేమన్నా  
నిద్ర మేల్కొల్పుటేమన్నా?

అని అటు తిరిగి పడుకున్నాడుట. నిద్రలేవడంలో అలాంటి బద్ధకాలుంటాయి. ఆ స్వప్న జగత్తులో నుంచి బయటపడటానికి ఆ జీవి వప్పుకోదు. ఇలాటి వారితో నిత్య జీవితంలో భార్యలు పడే అవస్థలు చెప్పలేం.

కొందరు గృహిణులు మాత్రం భర్తలలా నిద్రపోవడం చూచి ఎంతో ఉత్సాహపడతారు. "ఆయనగారలా ప్రొద్దెక్కేదాకా నిద్రపోతారు గనుక నాలుగు పనులు శాంతంగా చేసుకోగలుగుతున్నా. లేకపోతే ఏవుంది క్షణక్షణం పిలుపులేనాయె. ముందా సేవలు అందించిన తర్వాత గదా అత్తెసరు సంగతీ పాత్రలు తిప్పడం సంగతీనూ" అంటూ వుంటారు.

కొందరు అదృష్టవంతులు భర్త నిద్రలేవగానే యింత కాఫీ ఉంగలాగా త్రాగించి మళ్ళీ ఒకసారి పక్క దులిపి, దిండు తిప్పి వేసి 'పడుకోండి. పని అయిన తర్వాత లేపుతా. హాయిగా విశ్రాంతి తీసుకోండి' అని ఆయన్ని మాటలతో చిచ్చి కొట్టి లోపలికిపోయి మరో మాట కాఫీ కలుపుకుని త్రాగి అప్పుడు పనులు చూచుకోవడం ప్రారంభిస్తారు.

కొందరు మాటిమాటికీ లేస్తూనే వుంటారు. ఒక్క ముక్క ఏదో చెప్పి మళ్ళీ సమాధిలోకి వెళ్ళిపోతూ వుంటారు. ఒకసారి లేచి "నాలుగవుతోంది. నువ్వు లేస్తావా?" అని మళ్ళీ నిద్ర. ఇంకో గంటకు లేచి "పిల్లలు చదువుకుంటారేమో లేపుతావా" అని జవాబు చెప్పకముందే మళ్ళీ గాఢ సుషుప్తిలో మునిగిపోవడం. ఇంకో గంటకు లేచి "పాలు వచ్చాయి. పోయించు కుంటావా" అని

ఇప్పుడప్పుడే తొందర లేదన్నట్లు మళ్ళీ నిద్ర.

తమకు తోచినప్పుడే కళ్ళు గట్టిగా తెరిచి ప్రపంచాన్ని చూడటం. అందాకా చోపుదార్ కేకులు పెట్టడం ఎవరో వెనుక నుంచి "సోజా రాజకుమారా" అని జోలపాడినట్లు హాయిగా నిద్రపోవడం ఇలాటి మహనీయులు అంచెలు అంచెలుగా నేత్రాలు తెరిచి, చివరకు పూర్తి వీక్షణాలతో లోకాన్ని పునీతం చేస్తారు.

కొందరు నాలుగుగంటలకే లేచి కూర్చుని నానా వాగుడు మొదలు పెట్టి, ఇంట్లో వాళ్ళందర్నీ లేవగొట్టి పాలమనిషి మీద పగపట్టినట్లు బుసలు కొడుతూ వాకిట్లోకి, సావిట్లోకి తిరుగుతూ వుంటారు. వీరికి నిత్య ప్రత్యూష దర్శన భాగ్యం లభిస్తుంది. వీరి యాతనలు ఈసారి వర్ణిస్తాను.

Post your comments